కథానిక

# కన్యామణి

— కనుపర్తి వరలక్ష్మమ్మ



బాల్యమిత్రుడు రాజేశ్వరరావు ఆగమనం.

రమణారావు కెంతో ఆనందం కలిగించింది. ఉభయులు కుశల ప్రశ్నలైన తరువాత కాఫీ టిఫిన్ తీసుకొని కాసేపు అట్లా షికారు వెళ్లి వద్దామనుకుంటూ ఉండగా రమణారావు కుమారుడు శ్యాం వక్కపొడి డబ్బా చేతిలో పట్టుకొని 'ఇదో నాన్నా అమ్మ యిచ్చిందంటూ తండ్రికివ్వ వచ్చాడు. 'నాకు గాదు మామయ్యకివ్వు'అన్నాడు రమణారావు రాజును చూపిస్తూ. శ్యాం కొత్త మామయ్యను చూచి సిగ్గుపడి ఓరచూపులు చూస్తూ అట్లాగే నిలబడి పోయినాడు. రాజేశ్వరరావు శ్యాంను దగ్గరకు తీసుకొని ముద్దాడుతూ 'బాబూ' నీ పేరేమిటిరా?' అన్నాడు వక్కపొడితీసి నోట్లో వేసుకుంటూ. 'చ్యాము' అన్నాడు బాబు.

'మీ నాన్న పేరో'

'నమనారావు.'

'మీ అమ్మ పేరు?'

'మాతతి.'

మాతతి ఏమిటి బాగా చెప్పు? అన్నాడు రాజు. మాలతి అని చెప్పుబాబు అన్నాడు రమణారావు.

'ఇదేమిట్రా! మామయ్య కూతురు పేరు జానకి కాబోలునే?' అన్నాడు రాజు. ఏదో స్మరణకు వచ్చినట్లుయి.

'అవును' అంటూనే రమణారావు కూర్చున్నా వేమిరా అవిగో సబ్బు, నీళ్లు,లేచి ముఖం కడుక్కొని డ్రెస్ చేసుకో. కాసేపట్లో అట్లాషికారు వెళ్ళివద్దా మన్నాడు. రాజు వెంటనే లేచి ముఖం కడుక్కొని తలదువ్వుకొని దుస్తులు వేసుకొని షికారుకు సిద్ధమైనాడు. ఇంతలో రమణారావు గూడా డ్రెస్ చేసుకున్నాడు. అమ్మను తలుపు వేసుకోమని చెప్పు అని బాబును లోపలికి పంపించి తలుపు దగరకు లాగి రమణారావు రాజుతో కూడా షికారుకు బయలు దేరాడు. త్రోవలో ఎక్కువ మాట్లాడు కోకుండానే స్టేషన్ సమీపంగా రైలుకట్ట ప్రక్కనున్న తెల్లని యిసుక తిప్పల వద్దకు చేరుకున్నారు మిత్రులిద్దర్యూసూర్యుడు పశ్చిమాంబుధిలో క్రుంకబోతూ సంధ్యారుణ కాంతులతో లోకానికి వింతశోభ కలిగిస్తూ ఉన్నాడు. దక్షిణ దిశనుండి వచ్చే చల్లని పిల్ల తెమ్మెరలు దేహానికి, మనస్సుకుగూడా హాయిని ఇస్తూఉన్నవి. రమణీయమైన ఆ సంధ్యా సమయంలో మూడు సంవత్సరాలకు పిమ్మట కలుసుకున్న ఆ మిత్రులు భయులు పరస్పరం ఆప్యాయంగా మాట్లాడుకోవడం మొదలు పెట్టారు. మాలతిపేరు విన్నప్పటి నుంచి జానకిని వీడెందుకు చేసుకోలేదో అని జిజ్ఞాసతో ఉన్న రాజు 'అయితే నీవు మీ మామయ్య కూతుర్ని పెండ్లి చేసుకోలేదా ఏమిట్రా! ఆ అమ్మాయి పేరు జానకి గాబోలునే' అన్నాడు మళ్ళీ.

'చేసుకోలేదు' అన్నాడు. రమణారావు సిగ్గుతో విచారంతో తల వంచుకొని.

'పాపము మీ మామయ్య నిన్ను చిన్నప్పటినుంచి తన వద్దనే ఉంచుకొని చదువు చెప్పించాడుగా.'

'అవును అయన ఉన్నన్నాళ్ళు ఆయన సొమ్ము బాగానే తిన్నాము'

'అయితే మీ మామయ్య' అని సంకోచంతో చూచాడు.

'మా మామయ్య పోయి నాలుగేండ్లయింది'

'పాపము కుమార్తె వివాహం చేయకుండానే?'

'ఆ! అకస్మాత్తుగా పోయినాడు'

'మరి జానకి వివాహం ఇప్పుడైందా?'

'అయింది'

'మంచి సంబంధమేనా?'

'ఏ సంబంధ మయితేనేం. అంతా ఐపోయిందిగా'

'అయిపోవట మేమిటి రమణా! నీ మాటలన్నీ ఆశ్చర్యంగా ఉన్నాయి'

'అవును. ఆయనిప్పుడు లేడు'

'అయ్యో యెంత చక్కనిపిల్ల! ఎంత చదువుకున్నది! ఎంత మంచిది! నీవు వివాహం చేసుకున్నట్లయితే ఇంత కష్టం సంభవించక పొయ్యేదేమో! నీవు జానకికి చాలా అన్యాయం చేశావు. మీ మామయ్య నిన్ను పెంచడానికి నీకు చేసిన ఉపకారానికి నీవు జానకిని కాదనవలసింది గాదు'

'ఒరే! పాశ్చాత్యదేశాల్లో మూడు ఏళ్ళు ఉన్నందుకు అక్కడి నడవళ్లు నేర్చుకొని మన కుటుంబ వ్యవస్థ, మన ఆచారాలు మర్యాదలు మరచి పోయినట్లున్నావు'

'నేను జానకిని కాదనలేదు. కావలెనని పోరాడిపోరాడి విఫలుడనైనాను' అంటూ ఉండగా రమణారావు కంఠము దుఃఖంతో గాద్గదికమైంది. కళ్ళనీళ్ళు బొటబొటా కారాయి.

రాజు అతని దుఃఖం చూచి తెల్లబోయాడు. అయ్యో నిష్కారణంగా మనస్సు నొప్పించానే అని బాధ పడ్డాడు. కాని జానకి వివాహం విషయం పూర్తిగా తెలుసుకోవలెననే వాంఛను మాత్రం వదలలేక పోయినాడు. నీవు పోరాడి గూడా జానకిని పెండ్లాడలేక పోయినావా? అవునులే మన దేశంలో వరకట్న దురాచార మొకటి కన్నెల పాలిటి ప్రబల శత్రువై బాధిస్తున్నదిగా. కట్నము లేకుండా మీ తల్లి దండ్రులు వివాహానికి అంగీకరించలేదు కాబోలు!

'మా అమ్మ దేమీలేదు'

'మీ నాన్నగారే పట్టుపట్టారన్నమాట.'

'పట్టేమిటి గావు పట్టు' మా మామయ్య పోయిన తరువాత వాళ్ల కాపురం బాగా చితికి పోయింది. అప్పులవాళ్ళు ఎగబడి - ఉన్నది-మన్నది కట్టుకు పోయినారు. ఇల్లు గడవడమే కష్టమైపోయింది. జానకి పెళ్లిలా జరుగుతుంది. వారి పరిస్థితి యిట్లా ఉంటే అటు నేను ఎం.బి.బి.యస్. చదువుతున్నాననీ, కొంచెమో గొప్పో ఆస్తిపాస్తి కలవాళ్లమనీ నా కిస్తామంటున్న కట్నం అయిదు వేల్కు,పదివేలు, పదిహేను వేలు, యావదాస్తీ అంటూ వేలంపాటలాగా పెరి గిపోవడం మొదలు పెట్టింది. మా నాన్న ఈ ద్రవ్య వ్యామోహంలో బాగా పడ్డాడు. ఈ కట్నం ఎంత ఎక్కువ పుచ్చుకుంటే అంత గొప్ప వాళ్ళమనీ అనుకున్నాడు. మనం ఎంత గొప్పవాళ్ళం కాకపోతే మనకింత రొక్కమిస్తామంటున్నారన్న గర్వం కూడా కలిగింది. ఏం జెప్పను మా కొంప సంతబజారై పోయింది. నేను సంత కోడెనైనాను. వాళ్ల తస్సాదియ్యా ఆ ఆడపిల్లల తండ్రులు మా నాన్న చుట్టూ తిరిగి ఆశ పుట్టించడమే కాకుండా రైలు చార్జీలు పెట్టుకొని విశాఖ పట్నం దాకా వచ్చి హాస్టలు వద్దనో, కాలేజి గేటువద్దనో కావలా వేసి కూర్చుండేవాళ్ళు. నా చదువైనదాకా పెండ్లి చేసుకోనన్నా, నాకు పరీక్షలు జరుగుతున్నాయి చూడటానికి మాట్లాడటానికీ వీలుగాదనో ఏదో సాకులు చెప్పి ఎందరినో వెళ్లగొట్టా. ఏం చేస్తేనేం తుదకు రిటైర్డు డి.యస్.పి. ఒకడు వచ్చి జిడ్డులాగా పట్టుకున్నాడు. ఒక్కతే కూతురుట, వరకట్నం ముందు ఇరవై వేలిస్తాడుట. తరువాత యావదాస్తి నాదేనట. ఈ యెర వేశాడన్నాడు రమణ.

'పోలీసు నూవరెండెంటు చేసి బాగా దోచాడు కాబోలు' అన్నాడు రాజు నవ్వుతూ. ఆ డి.యస్.పి. ని చూసే నా కళ్ళు తిరిగిపోయినాయ్- ఇక ఆ కొమార్తె ఎట్లా ఉన్నదో? ఇక ఆయన నన్ను చూచిన తక్షణమే మా నాన్న వద్దకు వెళ్ళి కరారు చేసుకొని మా నాన్న చేత ఉత్తరం వ్రాయించాడు. మా నాన్న ఈ పెండ్లి నిశ్చయం వార్త తెలుపుతూ పెండ్లి పదిరోజులున్నది, నీకు ఈ రోజుననే అయిదు వందలు టి.యమ్.ఓ. పంపుతున్నాను. దానితో నీకు కావలసిన సూట్లు ఉంగరం వాచి వగైరాలు కొనుక్కోమని వ్రాశాడు. దానితో పాటు జానకికి వాళ్ళ ఊళ్ళోనే పెండ్లి నిశ్చయమైనదనీ, పెండ్లి మూడు రోజులున్నదనీ ఎవరో రెండో పెండ్లివాడి కిస్తున్నారనీ గూడా వ్రాశాడు. ఆ ఉత్తరం చూచి నే నెంత వేదనపొందానో, ఎంత దుఃఖించానో ఆ పరమాత్మునికెఱుక. జానకి! చిన్నతనం నుంచి నాదే అనుకున్న జానకి! నన్ను చేసుకొనే తాహతు లేక ఏ ముసలి ముండాకొడుకునో చేసుకొని అఘోరిస్తుంటే నేను పోలీసు నూవరేండెంటు కొమార్తెను చేసుకొని కులకడమా, ఆ మాట తలచుకుంటే కాళ్లక్రింద కంప పెట్టినట్లయింది. గుండెల్లో మంట పెట్టినట్లయింది ఎంతసేపో కుమిలి కుమిలి ఏడ్చా. ఏమిటి కర్తవ్యమని ఆ రోజల్లా కాలేజీకి పోకుండా కూర్చొని ఆలోచించా. సమయానికి డబ్బుకూడా చేతి కందింది. ఎందుకైనా మంచిదని ఆ డబ్బు తీసుకున్నా ఏమయినా సరే మానాన్న నన్ను ఏమి చేసినాసరే తక్షణం బయలుదేరి వెళ్ళి ఆ సుముహూర్తపు వేళకు నేనే జానకిని పెండ్లాడుదా మనే వెళ్లి నిశ్చయానికి వచ్చా. పెండ్లి ఎక్కడో తెలియదు.

